## క్లుప్తంగా

### వైభవంగా రామదండు రథయాత్ర



కొత్తపల్లిలో కొనసాగుతున్న రామదండు రథయాత్ర

కొత్తపల్లి: మండల కేంద్రంలో రామదండు రథ యాత్ర బుధవారం వైభవంగా జరిగింది. గువ్వలకుంట్ల గ్రామం నుంచి భక్తజన సందడి, డప్పు, మంగళ వాయిద్యాల మధ్య యాత్రకు కొత్తపల్లి గ్రామస్తులు గ్రామ పొలిమేరలో పూజా కార్యక్రమాలు చేసి ఆహ్వానం పలికారు. గ్రామంలో రామదండు రథయాత్ర నలు మూలల కనుల పండువగా సాగింది. పిల్లలు, పెద్దలు, మహిళలు రాముల దండు రథానికి కయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి 50 నుంచి 60 సంవత్సరాలకు ఒక సారి లోకకళ్యాణం కోసం, ప్రజలు సుఖ,శాంతుల ఉండాలని రామదండు రథ యాత్ర కొనసాగుతుందని రామదండు చిన స్వామి తెలిపారు. అనంతరం కొత్తపల్లి నుంచి బావాపురం గ్రామానికి రామదండు రథ యాత్ర చేరుకుంది.

### నిప్పులవాగుకు 735 క్యూసెక్కుల నీరు



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 700 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రెండు మోటార్ల ద్వారా 735 క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నారన్నారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు చేరుతున్న ఈ సాగునీటిని నిప్పులవాగుకు మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరు వరకు కేసీ కాల్వకు సాగునీరు సరఫరా అయ్యే అవకాశాలున్నాయని ఏఈ వెల్లడించారు.

### పాఠశాలలో విలీనం చేయాలి



కేవలం నలుగురు విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల బైరెడ్డినగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సమీపంలోని పాఠశాలలో విలీనం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులకు ఓ ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. నలుగురికి వంటచేసి పెట్టేందుకు ఓ మధ్యాహ్నభోజన నిర్వాహకురాలు ఉన్నారు. ఉన్న వారిని కూడా పాఠశాలకు సమీపంలోని స్కూల్‌లో విలీనం చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

### మల్యాలలో 'పొలం బడి'

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని మల్యాల గ్రామంలో బుధవారం పొలం బడి కార్యక్రమాన్ని వీఏఏ శాంతరాజు నిర్వహించారు. రైతులకు శనగ పంటలో చీడపీడల నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పంటలో పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు లింగకర్షక బుట్టలను ఎకరానికి 10 చొప్పున ఏర్పాటు చేసుకొని పురుగుల ఉధృతిని నివారించుకోవచ్చని సూచించారు. శనగ పంటలో మధ్యలో బంతిపూలను వేసుకోవడం ద్వారా పచ్చపురుగులను నివారించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఆవుల మధు, నడిపి మద్దయ్య, కమల్ పాల్గొన్నారు.

### కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

ఆత్మకూరు: పట్టణంలోని గోపాలమిత్రలో విధులు నిర్వహిస్తున్న మునయ్యకు రెండు కిడ్నీలు చెడిపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి బుధవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మునయ్యకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లాయర్ సుధాకర్‌రెడ్డి, సుల్తాన్, డేవిడ్, వార్డు సభ్యురాలు బోయపార్వతి పాల్గొన్నారు.

### 'ఆడుదాం..ఆంధ్ర'కు అన్నీ సిద్ధం చేయండి

నందికొట్కూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడలకు ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ గోపికృష్ణ సూచించారు. బుధవారం పాములపాడు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడుదాం ఆంధ్ర పోటీలకు టీమ్‌లను సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఆటలు ఆడేందుకు గ్రౌండ్, మైనర్ రిపేర్లు చేయించాలని సూచించారు. ప్రశాంతంగా పోటీలు నిర్వహించేందుకు అని రకాలుగా చర్యలు తీసుకోవాల న్నారు. మండలానికి క్రీడాకారులు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు. సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్లు, రాజశేఖర్, నాగరాజు, శ్రీనివాసులు, సాయికృష్ణ, సుమలత పాల్గొన్నారు.

# సొంతింటి కల నెరవేర్చడం నా బాధ్యత

- నున్నిపెంట వాసులూ కరెంట్ మీటర్లకు దరఖాస్తు చేసుకోండి
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- పాస్టర్లకు దుస్తుల పంపిణీ





పాస్టర్ దంపతులకు దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, భువనేశ్వరరెడ్డి, వేతనాలు పెంపు చేయడంతో ఎమ్మెల్యే శిల్పాకు కృతజ్ఞతలు తెలుపుతున్న సెక్యూరిటీ సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట వాసుల చిరకాల కోరికైన సొంతింటి కలను నెరవేర్చడం నా బాధ్యత అని రాష్ట్ర అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం శాసన సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బుధవారం సున్నిపెంటలోని కృష్ణవేణి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తలు, చర్చి పాస్టర్ల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం డ్యాం నిర్మాణ సమయంలో సున్నిపెంటకు వచ్చి స్థిరపడి ప్రభుత్వ గృహాల్లో నివసిస్తున్న వారికి, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారికి, ఇళ్లు లేని వారికి ఇళ్లు కట్టించి ఇవ్వడానికి కృషి చేస్తున్నానన్నారు. జీఓ నంబర్-40 ద్వారా 208.74 ఎకరాల్లో ఉన్న సున్నిపెంట గ్రామాన్ని గ్రామపంచాయతీ, పరిపాలన కిందికి తీసుకువచ్చామని తెలిపారు. ఎవరు నివసిస్తున్న గృహాలను వారికే ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సర్వే జరుగుతోందని చెప్పారు. దీని వలన నూతన నిర్మాణాలను కలెక్టర్ ఆదేశాల మేరకు సున్నిపెంట గ్రామంలో నిలుపుదల చేశారన్నారు. తాత్కాలికంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు తగ్గినప్పటికీ గృహ నిర్మాణాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు.

**విద్యుత్ మీటర్లకు కలెక్టర్ అనుమతి**

నేటి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ సున్నిపెంటలో విద్యుత్ మీటర్లు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ అనుమతిని ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ మీటర్లు అవసరమైన వారు గ్రామపంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్లి నో అబ్జక్షన్ సర్టిఫికేట్ తీసుకుని విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**సున్నిపెంటకు నిరంతర తాగునీరు సరఫరా**

శాశ్వత మంచినీటి సరఫరా కోసం ప్రతి నిత్యం ప్రజలకు నీరు అందించడం కోసం ఇప్పటికే రూ.16.5 కోట్ల ను ఖర్చు చేసి నూతన ట్యాంక్‌లు, పైప్‌లైన్లను నిర్మించామని, జలజీవన్ మిషన్ కింద మరో రూ.1.6 కోట్లతో 20 కి.మీ మేర పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆ పనులు పూర్తయితే సున్నిపెంట గ్రామానికి ప్రతి నిత్యం నీటిని అందిస్తామన్నారు. నీటి సరఫరా విషయంలో జలవనరుల శాఖకు చెందిన 20 మంది ఉద్యోగులు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఉన్న 8 మంది తాత్కాలిక సిబ్బంది, నలుగురు సచివాలయ సిబ్బంది, ఇరిగేషన్ శాఖకు చెందిన ఒక ఇంజినీర్‌తో నీటి సరఫరా చేయడానికి కలెక్టర్ సమక్షంలో విధులు నిర్ణయించినట్లు తెలిపారు. ఇంత అభివృద్ధి చేస్తున్నప్పటికీ రాజకీయ పరంగా వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేని కొందరు దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలు వాటిని అర్థం చేసుకుని సున్నిపెంట ప్రజల శాశ్వత పరిష్కారాల కోసం పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

**ముఖ్యమంత్రి సహకారంతో పంచాయతీకి నిధులు**

సున్నిపెంట గ్రామపంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రానప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మెయింటెనెన్స్ కోసం నిధులను తెప్పించుకోగలిగామని ఎమ్మెల్యే చెప్పారు. కొందరు స్వార్థపూరిత వ్యక్తులు సున్నిపెంట గ్రామ అభివృద్ధిని అడ్డుకునేందుకు కోర్టుల్లో పిటీషన్లు వేస్తున్నారని, ఇది ఏ మాత్రం సమంజసనీయం కాదని అన్నారు.ఈ సందర్భంగా మండలంలోని 51 మంది పాస్టర్లకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి , మండల అధ్యక్షుడు జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్‌దివ్యతేజ, టీఏమ్‌డీ రఫి, పాపారావు, పాస్టర్లు బి.దేవసహాయం, ఇమానియేలు, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థాన సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు పెంపు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సెక్యూరిటీ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చొరవతో వేతనాలు పెంచారు. బుధవారం శ్రీశైలం చేరుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. గత కొన్ని సంవత్సరాలుగా దేవస్థానాన్ని నమ్ముకుని సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నామని, తమకు వేతనాలు పెంచాలని అభ్యర్థించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేతనాలు పెరిగేలా చొరవ చూపారు. గతంలో సెక్యూరిటీ సిబ్బందికి వేతనం రూ.10,500 ఉండేది. అయితే ఎమ్మెల్యే చొరవతో ప్రస్తుతం సెక్యూరిటీ సిబ్బందికి రూ.13,087 వేతనం చెల్లించేందుకు సదరు కాంట్రాక్టర్ అంగీకరించారు. అలాగే గతంలో ఈపీఎఫ్ రూ.1,700 ఉండగా, ప్రస్తుతం రూ.3,750 పెంచారు. అంతేకాకుండా ఈఎస్‌ఐ ప్రస్తుతం రూ.600 పెంచారు. ప్రస్తుతం పెరిగిన వేతనం 26 రోజులకు మాత్రమే. అంతేకాకుండా సెక్యూరిటీ సిబ్బందికి వీక్ ఆఫ్ (వారాంతపు సెలవు రోజు) ఇచ్చేందుకు కూడా నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరలోనే వీక్ ఆఫ్ పై నిర్ణయం తీసుకుంటానని, త్వరలోనే ఈఎస్‌ఐ కార్డులు కూడా అందజేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించి తమకు వేతనాలు పెంచేలా కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పాకు సెక్యూరిటీ సిబ్బంది శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్లు మనోజ్, గుమ్మా రాజశేఖర్, నాగమల్లయ్య, శ్రీకాంత్, సురేష్, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

## సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



వెలుగోడులో రిటర్నింగ్ ఆఫీసర్, డీఎస్పీ, అధికారుల పర్యటన

వెలుగోడు: రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన అబ్దుల్లాపురం, వేల్పనూరు, రేగడగూడురు, గుంతకందాల, వెలుగోడు గ్రామాలను బుధవారం రిటర్నింగ్ ఆఫీసర్ సీ.వెంకటశివ, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగభూషణం, ఎస్‌ఐ వెంకట ప్రసాద్, తహసీల్దార్ నారాయణరెడ్డి సందర్శించారు. అక్కడ పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ బూత్ దగ్గర టాయిలెట్స్, ప్రహరీ, కరెంట్, వాటర్ తదితర సౌకర్యాలు ఉన్న చోట ఏర్పాటు చేసుకోవాలని గ్రామాధికారులకు సూచించారు. డీఎస్పీ మాట్లాడుతూ... రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇప్పటి నుండే సమస్యాత్మక గ్రామాల పై ప్రత్యేక దృష్టి సారించిచామన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గతంలో అబ్దుల్లాపురం, వేల్పనూరు సమస్యాత్మక గ్రామాలుగా ఉండేవి. తాజాగా రేగడగూడురును కూడా గుర్తించామన్నారు.

## తక్కువ ఖర్చు అధిక దిగుబడే లక్ష్యం



పొలంబడి క్షేత్రదినోత్సవ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కె.మహేష్

కొత్తపల్లి: పంటసాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందేలా చేయడమే పొలంబడి కార్యక్రమం లక్ష్యమని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ అన్నారు. బుధవారం మండలంలోని నంది కుంట గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పంటసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెలకువలు రైతులకు వివరించారు. అదేవిధంగా పొలంబడి రైతు తిరుపతి రెడ్డితో పొలంలో విత్తనం వేసినప్పటి నుంచి పంటకోత వరకు తీసుకున్న జాగ్రత్తలు, లింగాకర్షక బుట్టలు, జిగురు పల్లెములను పెట్టడం వల్ల కలిగే లాభాలను వివరించారు. అలాగే అధిక ఖర్చులను తగ్గించి దిగుబడిని పెంచుకొనే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణరెడ్డి, గ్రామ వ్యవసాయ సలహామండలి సభ్యులు, ఆర్‌బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 170 ట్యాబ్‌ల మంజూరు



మొదటి విడతగా 8వ తరగతి విద్యార్థులకు మంజూరైన ట్యాబ్‌లు

జూపాడుబంగ్లా: సాంకేతిక విద్యతో పాటు సీబీఎస్‌ఈ సిలబస్‌లో డిజిటల్ విద్యాబోధన చేసేందుకుగాను ప్రభుత్వం ఎనిమిదోవ తరగతి విద్యార్థులకు 170 ట్యాబ్‌లు మంజూరు చేసినట్లు ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూపాడుబంగ్లా మోడల్‌స్కూల్‌కు 99, పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 62 ట్యాబులు కేటాయించినట్లు తెలిపారు. పారుమంచాల ఉర్దూ-1, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉర్దూపాఠశాలకు 5 ట్యాబులు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులకు రెండోవిడతలో ట్యాబులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా గురువారం ట్యాబులు అందజేస్తామన్నారు.

## ఆడుదాం ఆంధ్ర పోటీలకు ఏర్పాట్లు చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వర కు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోటీల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో టీమ్‌ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేసి, పోటీలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే క్రీడా సామగ్రి అన్ని మండలాలలోని సచివాలయాలకు చేరవేశామన్నారు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు మైదానాలను సిద్ధం చేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు.

## పటిష్టంగా 'కుష్టు' సర్వే

నంద్యాల: జిల్లాలో కుష్టు వ్యాధి అనుమానిత కేసుల గుర్తింపునకు ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో కుష్టు వ్యాధి అవగాహన గోడపత్రికను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న సర్వేను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. జనవరి నుంచి జిల్లాలో ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సర్వే అడ్డు రాకుండా చూడాలన్నారు. జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శారదా బాయి, డీఎస్ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సునీత, డాక్టర్ కాంతారావు నాయిక్, పారా మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

### శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిప్యూటీ డీఈఓ మహబూబ్ బేగ్ అధ్యక్షతన కౌశల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన పాఠశాల గ్రూపును రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. అలాగే పోస్టర్ ప్రదర్శనలో ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. క్విజ్‌లో రాష్ట్రస్థాయికి రెండు పాఠశాలలను ఎంపిక చేసినట్లు పరిశీలకులు కుమార్‌బాబు తెలిపారు. విజేతలను ఇంజినీరింగ్ కళాశాల అధినేత వెంకటరామిరెడ్డి, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, ఎంఈఓ బ్రహ్మం, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, జిల్లా ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి అభినందించారు.

### 30 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

జూపాడుబంగ్లా: మండలంలోని 11గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 30 నుంచి 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30న తర్తూరు గ్రామంలో, 31న మండ్లెం, తంగడంచ, 01న పారుమంచాల, తూడిచెర్ల, 02న జూపాడుబంగ్లా, తాటిపాడు 03న భాస్కరాపురం, తరిగోపుల, 04న లింగాపురం, 80బన్నూరు, 05న పోతులపాడు గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారుల సమక్షంలో ఉదయం, సాయంత్రం వేళల్లో నాటకాలు, పాటలు, లఘుచిత్రాల ప్రదర్శనల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారని తెలిపారు.

**'వికసిత్ భారత్' షెడ్యూల్ విడుదల**

నందికొట్కూరు రూరల్ : మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర షెడ్యూల్‌ను బుధవారం ఎంపీడీఓ శోభారాణి విడుదల చేశారు. 20న బ్రాహ్మణకొట్కూరు, 21న కోళ్ల బావపురం, కోనేటమ్మ పల్లి, 22న వడ్డెమాను, అల్లూరు 23న శాతన కోట, మల్యాల, 24న 10- బొల్లవరం, దామగట్ల, 25న బిజినవేముల, నాగటూరు, 26న కొణిదేల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఉదయం 10 గంటలకు జోహా వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 11 గంటలకు ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం, 11.30 గంటలకు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### పోలీసు స్టేషన్ తనిఖీ

వెలుగోడు: పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్‌ఐని ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నాగభూషణం, ఎస్‌ఐ వెంకటప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు మహానందిలో సీఎం జన్మదిన వేడుకలు

మహానంది: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం మహానందిలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మ మహేశ్వరరెడ్డి తెలిపారు. ముందుగా శ్రీకామేశ్వరిదేవి, మహానందీశ్వరులకు అభిషేక, అర్చన పూజలు నిర్వహించిన అనంతరం వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

### విద్యుత్ పొదుపు సామాజిక బాధ్యత

నంద్యాల(అర్బన్): విద్యుత్ పొదుపును ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని నంద్యాల విద్యుత్ శాఖ డీ2 ఏఈ రామయ్య కోరారు. స్థానిక టెక్కె మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు.

### కత్తితో బెదిరించి చైన్ దోపిడీ

బొమ్మలసత్రం: ఇంటి ముందు వాకింగ్ చేస్తున్న 65 ఏళ్ల వృద్ధురాలిని గుర్తుతెలియని దుండగుడు కత్తితో బెదిరించి దోపిడీకి పాల్పడ్డాడు. బాధితురాలు సుబ్బరత్నమ్మ తెలిపిన వివరాల మేరకు.. నేషనల్ సీడ్స్ ఎదురుగా ఉన్న అశోక్‌నగర్‌లో ఆమె నివాసముంటుంది. బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంటి ముందు వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని దుండగుడు స్కూటీపై వచ్చి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు తాళి చైన్ ఇవ్వాలని కత్తితో బెదిరించడంతో ఆమె భయపడి చైన్ అందజేసింది. త్రీటౌన్ పోలీసులు దుండగుడి కోసం గాలిస్తున్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మిడుతూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికాభివృద్ధి సాధించాలని మెడికల్ ఆఫీసర్ రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో సర్పంచ్ చందాపురం భారతి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయుష్మాన్ భారత్, ముద్ర యోజన, ప్రధానమంత్రి జలజీవన్ మిషన్, పీఎం కిసాన్, తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోటేశ్వరుడు, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ పాల్గొన్నారు.

**బాల్య వివాహాలను అరికడదాం**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవాహన కల్పించి బాల్య వివాహాలను అరికడదామని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రవికుమార్ యాదవ్ అన్నారు. గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.

## హోరాహోరీగా క్రీడా పోటీలు



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మహానంది: మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ కళాశాలలో క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం హోరాహోరీగా సాగాయి. క్రికెట్, ఫుట్‌బాల్, 1500 మీటర్ల రన్నింగ్, 200 మీటర్ల రన్నింగ్, డిస్క్ త్రో, సార్ట్‌పుట్ , జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు కొనసాగాయి. ఈ మేరకు క్రికెట్‌లో ఉదయగిరి , తిరుపతి, నైరా, బాపట్ల, మార్కాపురం, కళాశాల జట్లు విజయం సాధించాయి. ఫుట్‌బాల్ విభాగంలో నైరా, ఎడ్వెర్ల, బాపట్ల, తిరుపతి కళాశాలలు విజేతలుగా నిలిచాయి.

**క్రీడలకు అన్ని ఏర్పాట్లు**

మహానంది వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో జరిగే క్రీడలకు ఏర్పాట్లు, వసతులు కల్పించినట్లు ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విద్యా రంగం డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ పి.సాంబశివరావు తెలిపారు. వ్యవసాయ కళాశాలలో క్రీడల ముగింపు వేడుకలపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 21న జరిగే ముగింపు కార్యక్రమాలకు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డా.శారదా జయలక్ష్మీదేవి , హార్టికల్చర్ రిసర్చ్ స్టేషన్ ప్రధాన శాస్త్రవేత్త ముత్యాల నాయుడు , శ్రీవెంకటేశ్వర పశు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డా.ధర్మారావు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.కెఎస్ఎస్ నాయక్, స్టూడెంట్ యాక్టివిటీస్ ఇన్‌చార్జ్ డా.పీవీ రమేష్ బాబు, ప్రొఫెసర్ డా.ఎంఎస్ రాహుల్ పాల్గొన్నారు.

## వేతనాలు పెంచే వరకూ సమ్మె



పటేల్ సెంటర్‌లో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు

నందికొట్కూరు: అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచే వరకూ సమ్మె కొనసాగుతుందని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ తెలిపారు. బుధవారం పట్టణంలో ప్రధాన రహదారి, పురవీధుల వెంట అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రఘురామమూర్తి, రమేష్, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాలు పుణ్యవతి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు భిక్షాటనతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ల హెల్పర్ల యునియన్ నాయకులు మంజుల, లక్ష్మీదేవి, ప్రమీళమ్మ, సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: అంగన్‌వాడీల సమ్మె తొమ్మిదో రోజుకు చేకుంది. బుధవారం మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు ఈ.హరిత అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టిన వారిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జూపాడుబంగ్లా: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం సంతగేటు వద్ద కేజీరోడ్డుపై రాస్తారోకో చేయటంతో పాటు భిక్షాటన చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల మండల అధ్యక్షురాలు వెంకటరమణమ్మ, నాయకురాళ్లు పద్మావతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాస్ డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీలు పట్టణంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. నాగమోహన్, కుమారి, సుమిత్రమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల రిలేనిరాహార దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు శ్రీశైలం మండలం మిడ్‌డే మీల్స్ కార్యకర్తలు సంఘీభావాన్ని తెలిపారు.

## ఎస్సీ కాలనీకి సీసీ రోడ్డు

పగిడ్యాల: మండలంలోని కొత్త ముచ్చుమర్రి ఎస్సీ కాలనీలో ఎంపీ నిధులతో సీసీ రోడ్లు వేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఈ కాలనీ నాలుగు దశాబ్దాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లకు మోక్షం లభించిందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో 300 మీటర్ల మేర సీసీ రోడ్డు వేశారు. అయితే రోడ్డుకు కాంట్రాక్టర్ క్యూరింగ్ సరిగా చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ మండల ఇంజినీర్ వెంకటేశ్వర్లును సంప్రదించగా రూ. 15 లక్షలు ఎంపీ నిధులు మంజూరు కాగా శివనాగిరెడ్డి ఈ పనులు చేస్తున్నారని చెప్పారు. 300 మీటర్ల మేర సీసీ రోడ్డు పూర్తి చేశారని వెల్లడించారు. క్యూరింగ్ పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ఎస్సీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు